

ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి

వైద్యుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. ఆస్పత్రుల్లో మహిళా వైద్యులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి. పని చేస్తున్న చోట ప్రతి మహిళా వైద్య సిబ్బందికి తాము భద్రతలో ఉన్నామన్న ధైర్యం కలిగించాలి. అప్పుడే వైద్యులు భయం లేకుండా ప్రజలకు సేవలు అందించగలుగుతారు. దీని కోసం ప్రత్యేక నూతన చట్టాలు తీసుకురావాలి.

- డాక్టర్ మనోహర్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి, ఆత్కూరు



మహిళా రక్షణలో ప్రభుత్వాలు వైఫల్యం

మహిళల సంరక్షణ చర్యల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందుతున్నాయి. పని ప్రదేశాల్లో రక్షణ లేకుండా పోతుంది. ఇష్టానుసారంగా దాడులు జరుగుతున్నాయి. పాలకులు మహిళా సంరక్షణ చర్యలు తీసుకోవాలి. పని ప్రదేశాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలి. అప్పుడే మహిళలు ధైర్యంగా తమ విధులు నిర్వహించుకోగలుగుతారు.

- ఆలపాటి ఉషారాణి, ఐద్వా మండల కార్యదర్శి, కంకిపాడు



ఏటిపాయకు మళ్లీ వరద



కాసరనేనివారిపాలెం వద్ద శివాలయాన్ని తాకుతూ ప్రవహిస్తున్న ఏటిపాయ



మద్దూరు వద్ద వరదనీటి ప్రవాహం

- అంచులు తాకుతూ వరదనీటి ప్రవాహం
- రాకపోకలు నిలిపివేసిన అధికారులు

కంకిపాడు: ఏటిపాయకు మళ్లీ వరద వచ్చిపడింది. ఎగువ నుంచి వరదనీరు భారీగా చేరుతుండటంతో అధికారులు ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు వరదనీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణానది ఏటిపాయ వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల వెంబడి కృష్ణానది ఏటిపాయ ప్రవహిస్తుంది. గురువారం ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 1.61 లక్షలు క్యూసెక్కులు వరదనీటిని విడుదల చేశారు. మరో 3 లక్షలు వరకూ విడుదల చేసే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం విడుదల చేసిన నీటితో ఏటిపాయ అంచులు తాకుతూ వరదనీరు ప్రవహిస్తోంది. కాసరనేనివారిపాలెం వద్ద శివాలయం అంచులు తాకుతూ నీరు దిగువకు పరవళ్లు తొక్కుతోంది.



ఒడ్డుకు చేర్చిన పడవలు

నిలిచిన రాకపోకలు

ఏటిపాయలో లంకభూముల్లోకి వెళ్లేందుకు వీలుగా, ఇసుక రవాణాకు అనువుగా రహదారి మార్గం ఉంది. ఇటీవల వచ్చిన వరదతో రహదారి మార్గం కొట్టుకుపోయింది. మరోమారు వచ్చిన వరదతో మళ్లీ ఏటిపాయ రహదారి ముంపునకు గురైంది. ఏటిపాయ అంచులు తాకుతూ వరద నీరు ప్రవహిస్తుండటం, రహదారి మార్గం మునగడంతో లంకభూముల్లోకి వెళ్లేందుకు ఆస్కారం లేకుండా పోయింది. ముందస్తు చర్యల్లో భాగంగా రెవిన్యూ శాఖ అధికారులు ఏటిపాయలోకి రాకపోకలను నిలిపివేశారు. హెచ్చరిక బోర్డులను ఏటి ఒడ్డున ఏర్పాటుచేశారు. మత్స్యకారులు వరద నీటి కారణంగా ఏటిపాయలో ఉన్న పడవలను ఒడ్డుకు చేర్చారు.

లైంగికదాడులకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎంఈఓ-1 శ్రీరామ్ బాలాసింగ్, పక్కన సీడీపీవో వెంకటలక్ష్మి, ఏఎస్ఐ రాజు



ఉయ్యూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మాట్లాడుతున్న డీవైఈఓ పద్మారాణి

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థులపై లైంగికదాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బాపులపాడు ఎంఈఓ-1 శ్రీరామ్ బాలాసింగ్ అన్నారు. స్థానిక నూజివీడురోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో విద్యాశాఖ, పోలీస్, ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా ఉపాధ్యాయులకు పోక్సో చట్టంపై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఎలాంటి ఆరోపణలు వచ్చినా తక్షణమే ఆ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు వేస్తామని ఎంఈఓ-1 హెచ్చరించారు. ఐసీడీఎస్ గన్నవరం సీడీపీవో వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఎక్కువగా ముభావంగా ఉంటే పిల్లలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. హనుమాన్‌జంక్షన్ ఏఎస్ఐ రాజు మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురైన విద్యార్థులు 1098 లేదా 100 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎంఈఓ-2 బి.సురేష్ కుమార్, ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీవో టి.జి.పద్మావతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి శ్యామల, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తోట వెంకట నాగేశ్వరరావు, ఎస్.లూథర్‌పాల్, కొమ్మా విజయ్, పి.జగతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనమలూరు: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులను పరిరక్షించే బాధ్యత అందరిపై ఉంటుందని పెనమలూరు సీఐ వెంకటరమణ అన్నారు. కానూరులో గురువారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో చదివే విద్యార్థినుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై పిల్లల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంకిపాడు: జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కంకిపాడులోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో గురువారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ గురువులు తమ బాధ్యతలను గుర్తెరిగి వ్యవహరించాలని, సమాజ ఉద్ధరణలో భాగస్వాములు కావాలని సూచించారు. సీడీపీఓ బేబి సుకన్య, ఏఎస్ఐ తాతాచార్యులు, ఎంఈఓ-1 శేషగిరిరావు, పలువురు అధికారులు, మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

ఉయ్యూరు: ఉయ్యూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మహిళా చట్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈఓ పద్మారాణి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు గురుతర బాధ్యత వహించాలన్నారు. న్యాయవాది ఎస్.సుదర్శన్‌రావు మాట్లాడుతూ పోక్సో చట్టం, విద్యార్థులు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ విశ్వనాథ్, ఎంఈఓ-2 సుధారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబి సరోజిని, యూటీఎఫ్ నాయకులు రమణ పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ సొమ్ము విడుదల

పెనమలూరు: మండల పరిధిలో పింఛన్ లబ్ధిదారులకు సామాజిక పింఛన్ సొమ్ము ప్రభుత్వం విడుదల చేసిందని ఎంపీడీవో సునీతాశర్మ తెలిపారు. ఆమె గురువారం వివరాలు తెలుపుతూ పెనమలూరు మండలంలో 5,777 మంది పింఛన్‌దారులకు రూ. 2.41 కోట్లు, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో 12,725 మందికి రూ. 5.41 కోట్లు విడుదలయిందని చెప్పారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఆగస్టు 31వ తేదీ శనివారం పింఛన్ పంపిణీ చేస్తామని ఎంపీడీవో తెలిపారు. ఈ మార్పును పింఛన్‌దారులు గమనించాలని కోరారు.

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పింఛన్ లబ్ధిదారులు ఈ నెల 31వ తేదీ పింఛన్ తీసుకోవాలని మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. సచివాలయ సిబ్బందికి లబ్ధిదారులు సహకరించాలని సూచించారు.

వికసిత ఏపీ సమావేశం

కానూరు ఆహ్వానం కల్యాణ మండపంలో శుక్రవారం వికసిత ఏపీ సమావేశం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సునీతాశర్మ తెలిపారు. ఉదయం జరగాల్సిన సమావేశం సాయంత్రానికి మారిందన్నారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

'వనం-మనం' విజయవంతం చేయాలి

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి అమలు చేస్తున్న వనం- మనం కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలని విజయవాడ రూరల్ మండల ఈఓఆర్డీ ఎండీవీ ప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని కాలేజీలు, స్కూల్స్‌ల్లో ఉన్న ఖాళీ ప్రదేశాలను గుర్తించి ప్రభుత్వం సరఫరా చేసే మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. గ్రామాల్లో కార్పొరేట్ సంస్థలు, ఎన్‌జీఓ సంస్థలను సంప్రదించి వారి సౌజన్యంతో మొక్కలను నాటాలన్నారు. ముఖ్యంగా అమ్మ పేరిట ప్రతి ఒక్కరితో ఒక్కో మొక్కను నాటించాలని సూచించారు.

రేపు పింఛన్ల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని లబ్ధిదారులందరికి ఈనెల 31వ తేదీ శనివారం పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. నూరు శాతం పింఛన్ల పంపిణీ జరగాలని సూచించారు.

కల్తీ ఇంజిన్ ఆయిల్ సీజ్

పెనమలూరు: కానూరు కొత్త ఆటోనగర్‌లో కల్తీ ఇంజిన్ ఆయిల్‌ను పోలీసులు పట్టుకున్నారు. సీఐ వెంకటరమణ కథనం మేరకు కానూరు కొత్త ఆటోనగర్‌లో కల్తీ ఇంజిన్ ఆయిల్ అమ్ముతున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో కానూరు కొత్త ఆటోనగర్‌లో పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందిన (ఐఓసీఎల్) కల్తీ ఇంజిన్ ఆయిల్‌తో పాటు, నకిలీ లూబ్రికెంట్స్ ఆయిల్, ఐఓసీఎల్ లేబుళ్లతో నకిలీ ఆయిల్ టిన్నులు, ప్యాకెట్లు, ఎంఆర్‌పీ ధరలకు సంబంధించి లేబుళ్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047పై సమావేశం

గన్నవరం: స్థానిక కొత్తపేట రోటరీ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047పై నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఇ.సత్యకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



కానూరులో క్రీడాకారుల వాక్



ప్రొద్దుటూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ ప్రసాద్

పెనమలూరు: కానూరులో గురువారం జాతీయ క్రీడా, తెలుగుభాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అశోక్ జిమ్, మాతృ హృదయ్ స్వచ్ఛంద్ సేవాసంఘ్, జిల్లా నెహ్రూ యువ కేంద్రం, యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. తొలుత క్రీడాజ్యోతిని జిల్లా నెహ్రూ యువకేంద్రం యూత్ ఆఫీసర్ సుంకర రాము వెలిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకొంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా టూకే వాక్ నిర్వహించారు. అలాగే కానూరులో తెలుగుభాషా దినోత్సవం కూడా క్రీడాకారులు చేశారు. తెలుగుభాష పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ కృష్ణారావు, డాక్టర్ సీహెచ్ పవన్, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఈదా రాజేష్, ప్రముఖులు శ్రీనివాసరావు, షాజిద్, యార్లగడ్డ శ్రీను, నరేంద్ర, ఫాదర్ తాళ్లూరి ఆనంద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కంకిపాడు: విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం సాధించాలని ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ సూచించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరు జెడ్పీ పాఠశాలలో స్పోర్ట్స్ క్లబ్‌ను గురువారం ప్రారంభించారు. విద్యార్థులకు పలు క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, వికాసానికి దోహదపడతాయన్నారు. హెచ్‌ఎం అరుణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గోసాల హెచ్‌ఎంకే హైస్కూల్‌లో క్రీడా దినోత్సవం నిర్వహించారు. క్రీడా పోటీలపై విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులకు పలు క్రీడల్లో పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రిన్సిపాల్ సుక్‌మిత్ కౌర్ పర్యవేక్షించారు.

స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుల అందజేత



కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్న హెచ్‌ఎం కె.శేషుకుమారి

ఉంగుటూరు: మండలంలో పెద్ద అవుటపల్లి, ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్స్ స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులను కైవసం చేసుకున్నాయి. 2023-24 సంవత్సరానికి సంబంధించి క్రీడలలో జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన అయిదు పాఠశాలలకు అవనిగడ్డలో గురువారం నిర్వహించిన స్పోర్ట్స్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్, అధికారులు అవార్డులను అందజేశారు. పెద్ద అవుటపల్లి జెడ్పీ హైస్కూల్ మొదటి స్థానం, ఉంగుటూరు అయిదవ స్థానం దక్కించుకున్నట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శేషుకుమారి, అనితలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద అవుటపల్లి, ఉంగుటూరు హెచ్‌ఎంలు శేషుకుమారి, అనితలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఈవో తాహెరా సుల్తాన శాలువాతో సత్కరించి అవార్డులను అందజేశారు. అవార్డు గ్రహీతలను పలువురు అభినందించారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి



టీషర్ట్‌లు ధరించిన క్రీడాకారులతో రమణ, కిషోర్

గన్నవరం: ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కకరూ ముందుకు రావాలని కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఛైర్మన్ కేవీ రమణ, కార్యదర్శి కేవీఆర్ కిషోర్ పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు గురువారం కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా టీషర్ట్‌లు, స్పోర్ట్స్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గన్నవరం ప్రాంతానికి చెందిన ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సాధించారని తెలిపారు. వారి స్ఫూర్తితో గ్రామీణ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా తమ అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. వాలీబాల్ క్లబ్‌ను ఏర్పాటు చేసి ఉత్తమ క్రీడాకారులుగా యువతను తీర్చిదిద్దుతున్న నిర్వాహకులను అభినందించారు. వాలీబాల్ క్లబ్‌కు చెందిన రామారావు, చిన్నారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స



కానూరులో చల్లా లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



ఉయ్యూరులో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

గన్నవరం రూరల్: దేశ భాషలందు తెలుగు లెస్స అని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సగ్గుర్తి శ్రీనివాసరావు అన్నారు. తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పాఠశాలలో తెలుగు భాష ఉద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎంతో విశిష్టత కలిగిన భాష తెలుగు అని పేర్కొన్నారు. తెలుగు మాట్లాడటం గర్వకారణంగా భావించాలన్నారు. తెలుగులో పాటలు, పద్యాలు, కథలు ఎంతో ఖ్యాతి గడించాయని వివరించారు. తెలుగు ఉపాధ్యాయుడు దామోదర గణపతి పాటలతో అలరించారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి గుర్రం రాజబాబు, పీడీ లక్ష్మణరావు, పాఠశాల ఉపాధ్యాయుల కార్యదర్శి మణిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఉయ్యూరులో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ఆవశ్యకతను చాటుతూ ప్రదర్శనలు చేశారు. ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీ సిద్దార్థ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, డైరెక్టర్ జీజేపీ వినయ్‌కుమార్ తెలుగు భాష ఆవశ్యకతను వివరించారు.

పెనమలూరు: తెలుగు భాష మాధుర్యం ఇతర భాషలకు లేదని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు విద్వాన్ చల్లా లక్ష్మీనారాయణ అన్నారు. కానూరు సిద్దార్థ ఆదర్శ రెసిడెన్సియల్ పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు పద్యం తెలుగు వారికే సొంతమన్నారు. తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యతని అన్నారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ మాట్లాడుతూ అమ్మ పిలుపులోని కమ్మదనం తెలుగులోనే ఉందని అన్నారు. తెలుగు భాషాభిమానం పెంచే విధంగా విద్యార్థులు నృత్యాలు, నాటకాలు చేశారు. అనంతరం చల్లా లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని గురువారం హనుమాన్‌జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రముఖ తెలుగు భాషా పండితురాలు, పాఠ్య పుస్తక రచయిత డాక్టర్ నిడమర్తి లలితా కామేశ్వరిని సత్కరించారు. మానవత కేంద్ర కమిటీ కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, మానవత సభ్యులు పాల్గొన్నారు. వీరవల్లి ఆర్‌హెచ్ కాలనీ ఎంపీపీ స్కూల్, వీరవల్లి, రేమల్లే జెడ్పీ హైస్కూళ్లలోనూ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఉంగుటూరు: ఆత్కూరు జెడ్పీ హైస్కూల్‌లో డీపీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యాన మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల భాషా ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం కెవిబికె. సుధాకర్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను, ప్రధాన కార్యదర్శి పీవీ రావు, బి.అంజనేయులు, పివివి. ప్రసాద్ పాల్గొన్నారు.

లభ్యం కాని రాజేష్ ఆచూకీ



గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో ఏలూరు కాలువలోకి కారు దూసుకుపోయిన సంఘటనలో గల్లంతైన డ్రైవర్ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో కంకిపాడు మండలం మారేడుమాకకు చెందిన గుడిసె రాజేష్ గల్లంతైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన గన్నవరం పోలీసులు గురువారం ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని రంగంలోకి దింపారు. ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి మూడు కిలోమీటర్లు వరకు ఎన్డీఆర్ఎఫ్ బృందం మోటర్ బోట్లలో గాలింపు చేపట్టారు. డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, సీఐ శివప్రసాద్ గాలింపు చర్యలను పర్యవేక్షించారు. సాయంత్రం వరకు కాలువను పూర్తిగా జల్లెడ పట్టినప్పటికీ రాజేష్ ఆచూకీ లభ్యం కాలేదు. సంఘటన జరిగి రెండు రోజులు గడుస్తున్న ఎటువంటి పురోగతి కనిపించకపోవడంతో ఈ కేసు మిస్టరీగా మారింది.

క్లుప్తంగా

వ్యాధులు సంక్రమించకుండా చర్యలు తీసుకోవాలి



పెనమలూరు: వ్యాధులు సంక్రమించకుండా నివారణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అసంక్రమణ వ్యాధుల విభాగం వైద్యురాలు సౌజన్య అన్నారు. ఆమె వైద్య బృందంతో గురువారం పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రాల సేవలు పరిశీలించారు. అనంతరం పెనమలూరు, తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడలోసెంట్ ఫ్రెండ్లీ హెల్త్ డే కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైల్డ్ ఫ్లోరోసిస్ బారిన పడిన విద్యార్థులకు విటమిన్-సి ట్యాబ్‌లెట్లు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు డెంటల్ క్యాంపు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి బిజిలి శ్రీనివాసరావు, జిల్లా కన్సల్టెంట్ డాక్టర్ బద్రినాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



పెనమలూరు: కానూరు 100 అడుగుల రోడ్డులో ప్రమాదాల నివారణకు పోలీసులు గురువారం చర్యలు చేపట్టారు. కానూరు రోడ్డులో స్పీడ్ బ్రేకర్‌ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని సాక్షిలో వచ్చిన కథనంపై పోలీసు అధికారులు స్పందించారు. కానూరు రోడ్డులో రెండు ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు కొత్తగా వేశారు. స్పీడ్ బ్రేకర్లు ఉన్న ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు కాని, రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు సూచించే తెల్లని లైన్లు కానీ లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ వెంటనే స్పందించి స్పీడ్ బ్రేకర్ల వద్ద తెల్లని లైన్‌లు పెయింట్‌తో వేయించారు. వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా' కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థులకు లింక్ వర్కర్లు సదాలక్ష్మి, కరుణ అవగాహన కల్పించారు. ప్రాణాంతకరమైన హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సురక్షితం కాని లైంగిక సంబంధాల కారణంగానే ఈ వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడం ద్వారానే నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఉయ్యూరు: పేద విద్యార్థుల విద్యా ఉన్నతికి కృషి చేస్తున్నామని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉయ్యూరు శాఖ చైర్మన్ కొలసాని రవికుమార్ అన్నారు. ఉయ్యూరు పట్టణానికి చెందిన కేశన శ్రీనివాసరావు ఇద్దరు పిల్లలు ప్రైవేటు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో శ్రీనివాసరావుకు ఫీజు చెల్లించే నిమిత్తం రూ. 15 వేలు ఆర్థిక సాయాన్ని గురువారం అందించారు. కార్యక్రమంలో సేవాసంస్థ అధ్యక్షుడు సాకి రాజేష్, ప్రతినిధులు పినమాల నాగకుమార్, మన్నెం అనిల్‌కుమార్, పారుపూడి శివకృష్ణ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి, ప్రింటర్ వితరణ



కంకిపాడు: అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అవసరమని ప్రొద్దుటూరు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఎం.అరుణకుమారి అన్నారు. 1973-74 బ్యాచ్ విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రి, ప్రింటర్‌ను గురువారం వితరణగా అందించారు. హెచ్‌ఎం అరుణకుమారి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు అందించిన సహాయ సహకారాలు ప్రశంసనీయమన్నారు. దాతృత్వాన్ని అలవర్చుకుని, సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాంబశివారెడ్డి, బొట్ట నరేంద్రరెడ్డి, కూరపాటి ఉష, కూరపాటి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలోని మర్లపాలెం, చిన్న అవుటపల్లి, భార్గవినగర్, మెగ్నా రోడ్డు, వేపగుంట రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహణ ఇంజినీర్ పి.హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.